సాక్షి నిర్మల్

సోమవారం । 15 । జూలై । 2024

గరిష్టం/కనిష్టం
29.5 /24.4

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. రుతుపవనాల ప్రభావంతో చాలాచోట్ల వర్షం కురిసే అవ కాశం ఉంది.


నెత్తిన బోనంతో మహిళ


నెత్తిన బోనంతో శివసత్తుల నృత్యాలు




పొట్టేళ్ల రథంపై అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న యువకులు


కుంటాలలో బోనమెత్తిన ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్


కుంటాలలో బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు


ఏఎన్‌రెడ్డి నగర్‌లో మహిళల పూజలు


గండిరామన్న ఆలయంలో దుర్గామాతకు హారతి ..

ఆషాఢ బోనం.. అమ్మకు నైవేద్యం

ఆషాఢ మాసం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పోచమ్మ, మారెమ్మ, దుర్గామాత, మహాలక్ష్మి, ఎల్లమ్మ తదితర గ్రామ దేవతలకు భక్తులు ఆదివారం బోనాలు సమర్పించారు. పల్లె, పట్టణం అని తేడా లేకుండా అంతటా ప్రతీ ఇంటా కొత్త కుండలో బోనం వండి.. తర్వాత కుండలను పసుపు కుంకుమలు, వేప కొమ్మలతో అలంకరించి డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, పోతురాజుల నృత్యాల నడుమ ఊరేగింపుగా అమ్మవార్ల ఆలయాలకు చేరుకున్నారు. బోనం నైవేద్యంగా సమర్పించి ఇంటిల్లిపాదిని చల్లంగా చూడాలని పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. కోళ్లు, మేకలను బలి ఇచ్చారు. దీంతో జిల్లా అంతటా పండుగ వాతావరణం నెలకొంది. గ్రామదేవతల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జిల్లా కేంద్రంలోని ఏఎన్ రెడ్డి కాలనీలోని ఏఎంఆర్ టవర్స్‌లో మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి మారెమ్మ ఆలయంలో పూజలు చేశారు. కుంటాలలోని శ్రీమహాలక్ష్మి ఆలయ 17వ వార్షికోత్సవం, ఆషాఢ ఆదివారం పురస్కరించుకుని బోనాలు తీశారు. గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ హాజరై బోనం ఎత్తుకున్నారు. జనగామ ఆర్డీవో శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

– సాక్షి ఫొటో గ్రాఫర్ నిర్మల్/కుంటాల

న్యూస్‌రీల్

కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ సమావేశానికి జిల్లా సభ్యులు


సమావేశంలో పాల్గొన్న జిల్లా సభ్యులు

నిర్మల్‌ఖిల్లా: తెలంగాణ రాష్ట్ర కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరుగుతున్న ఆలిండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్స్ సర్వసభ్య సమావేశాలకు జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు సాధం అరవింద్, రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ మెంబర్ నేరెళ్ల ప్రమోద్ పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏఐవోసీడీ అధ్యక్షుడు ఎస్ఎస్.షిండే దేశంలో ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలతో ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారాల గురించి కేంద్ర ఆరోగ్య శాఖ దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు. నార్కోటిక్ డ్రగ్స్ షెడ్యూల్ హెచ్ అండ్ ఎక్స్ డ్రగ్స్ అమ్మకాల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి వచ్చిన ఏఐవోసీడీ సభ్యులు రాష్ట్రంలోని వివిధ జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల కోసం ప్రత్యేక బస్సులు

నిర్మల్‌టౌన్: డీఎస్సీ అభ్యర్థుల కోసం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి తెలిపారు. డీఎస్సీ పరీక్షల కోసం నిర్మల్ నుంచి హైదరాబాద్‌కు ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సులు ఈ నెల 18 నుంచి 24 వ తేదీ వరకు ఉదయం 3 గంటలకు, రాత్రి 11.30 గంటలకు నడుపుతున్నట్లు వివరించారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో లేదా బస్టాండ్ వద్ద ముందస్తుగా రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలిపారు.

జీరో బిల్లుకు దూరం

- భైంసా పట్టణంలోని ఏపీనగర్‌కు చెందిన నేరెల్‌వార్ భారత్‌బాయి కుటుంబ సభ్యులతో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. తెల్ల రేషన్‌కార్డు ఉండడంతో గృహజ్యోతి కింద జీరో విద్యుత్ బిల్లు కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయినా ప్రతినెలా కరెంట్ బిల్లు వస్తోంది. అధికారుల దగ్గరికి వెళితే సవరణకు ఆప్షన్ ఇవ్వలేదని చెబుతున్నారు. ఇంటిల్లిపాది పని చేస్తేనే తమ ఇల్లు గడుస్తుందని ఇంటి అద్దెతోపాటు కరెంట్ బిల్లు చెల్లించాల్సి వస్తుండడంతో వారు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- భైంసాలోని రాహుల్ నగర్‌కు చెందిన దుమ్మెన్ సుబ్బుత్రబాయికి సొంత ఇల్లు ఉంది. తెల్ల రేషన్‌కార్డు ఉండడంతో గృహజ్యోతి కోసం ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకుంది. అయినా జీరో విద్యుత్ బిల్లు రావడం లేదు. దీంతో ప్రతినెలా విద్యుత్ బిల్లు చెల్లిస్తున్నామని చెబుతున్నారు. సవరణకు సంబంధించి వీరికి ఎలాంటి అవగాహన లేకపోవడంతో మిన్నకుండిపోతున్నారు.



- అర్హత ఉన్నా కరెంటు బిల్లు కడుతున్న పేదలు
- అయోమయంలో దరఖాస్తుదారులు
- సవరణకు ఆప్షన్ లేదంటున్న అధికారులు

బిల్లు చెల్లించమంటున్నరు..



అమ్మ బడేకర్ భూదేవి పేరు మీద విద్యుత్ మీటర్ ఉంది. గృహజ్యోతి కింద తెల్ల రేషన్‌కార్డుతో దరఖాస్తు చేసుకున్నం. అయినా జీరో విద్యుత్ బిల్లు రావడం లేదు. 200 యూనిట్లలోపే విద్యుత్ వినియోగిస్తున్నా బిల్లు వస్తోంది. అధికారులు ఇంటికి వచ్చి బిల్లు చెల్లించాలంటున్నరు. ఏం చేయాలో తెలియడం లేదు.
– దినేష్, పిప్రి కాలనీ, భైంసా

సవరణలకు అవకాశం...

గృహజ్యోతి పథకంలో లోపాల సవరణకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో తెల్ల రేషన్‌కార్డు, ప్రజాపాలన దరఖాస్తు ప్రతితో వెళ్లి సంప్రదించాలి. విద్యుత్ కనెక్షన్ నంబర్ తప్పుగా నమోదు చేసిన వారు సవరణ చేసుకునే అవకాశం ఉంది. సవరణ తర్వాత జీరో బిల్లు వస్తుంది.
– సుదర్శన్, ఎస్ఏవో, నిర్మల్

భైంసాటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో భాగంగా గృహజ్యోతి పథకం అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో తెల్ల రేషన్ కార్డు ఉండి, 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగదారులకు జీరో బిల్లు వర్తింపజేస్తోంది. ఇందుకు అర్హుల ఎంపిక కోసం వార్డుల వారీగా ప్రజాపాలన వేదికలు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించింది. వీటిలో చాలావరకు జీరో బిల్లులు వస్తుండగా, ఇంకా కొందరికి జీరో విద్యుత్ బిల్లు రావడం లేదు. అన్ని అర్హతలున్నా.. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నా విద్యుత్ బిల్లు వస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. దీంతో అర్హులు అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

సవరణలకు అవకాశం లేక...

ప్రజాపాలన వేదికలో ఐదు గ్యారెంటీల అమలుకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మహాలక్ష్మి, గృహజ్యోతి, రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. అయితే, గృహజ్యోతిలో భాగంగా 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ కోసం దరఖాస్తు సమయంలో అవగాహన లేక కొందరు వివరాలు తప్పుగా నమోదు చేశారు. దరఖాస్తుల ఆన్‌లైన్ సమయంలో సైతం ఆపరేటర్లు వివరాలు తప్పుగా నమోదు చేశారు. ఫలితంగా కొందరు జీరో విద్యుత్ బిల్లుకు దూరమయ్యారు.

ట్రాఫిక్ ఉల్లం‘ఘనులకు’ చెక్!

- జిల్లా వ్యాప్తంగా పోలీసుల విస్తృత తనిఖీలు
- నిబంధనలు పాటించని వాహనదారులపై కొరడా
- మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి
- ఒకేరోజు 664 కేసులు నమోదు

ఒక్క రోజు నమోదైన కేసులు	
హెల్మెట్ ధరించని కేసులు	565
ఓవర్ స్పీడ్	01
డ్రంకెన్‌డ్రైవ్	02
మైనర్ డ్రైవింగ్	02
లైసెన్స్ మర్చిపోయినవి	07
సెల్‌ఫోన్ డ్రైవింగ్	01
సీట్ బెల్ట్ ధరించని కేసులు	05
యూనిఫామ్ లేకుండా డ్రైవింగ్	09
ట్రిపుల్ డ్రైవింగ్	07
నంబర్ ప్లేట్ లేని కేసులు	66


వాహనాలు తనిఖీ చేస్తున్నపోలీసులు

నిర్మల్‌టౌన్: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపైకి వస్తున్న వాహనదారులపై కొరడా ఝుళిపిస్తున్నారు. నిబంధనలు పాటించనివారిని గుర్తించేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో నాకాబందీ నిర్వహించారు. శని, ఆదివారం జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేపట్టారు. ఎస్పీ జానకీషర్మిల ఆదేశాల మేరకు భైంసా ఏఎస్పీ అవినాష్, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి పర్యవేక్షణలో తనిఖీలు జరిగాయి. మైనర్ డ్రైవింగ్, నిషేధిత గుట్కా, గంజాయి విక్రయం, అక్రమ రవాణాపై ఈ తనిఖీల్లో ప్రత్యేక దృష్టిసారించారు. 24 గంటల్లోనే జిల్లా వ్యాప్తంగా 664 కేసులు నమోదు చేశారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే ఓనర్లపై కేసు



మైనర్ల చేతికి వాహనాలు ఇస్తే ఓనర్లపై కేసులు నమోదు చేస్తాం. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి. వాహనదారులు తప్పనిసరిగా అన్ని ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలి. నిషేధిత గంజాయి అక్రమ రవాణాను నిరోధించడానికి నార్కోటిక్స్ విభాగంలో ప్రత్యేక శిక్షణ పొందిన రెండు పోలీస్ జాగిలాలు బస్టాండ్లు, వ్యాపార సముదాయాలలో నిత్యం తనిఖీలు చేపడుతున్నాం. ఎవరైనా మత్తు పదార్థాలు రవాణా చేస్తున్నట్లు తెలిస్తే 8712659599 నంబర్ లేదా డయల్ 100 కి సమాచారం అందించాలి. శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం.
– జానకీ షర్మిల, ఎస్పీ

జిల్లాలో మోస్తరు వాన

భైంసాటౌన్: జిల్లాలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు మోస్తరు వర్షపాతం నమోదైంది. వర్షాకాలం ప్రారంభమైనా సరైన వానలు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి జిల్లాలోని అన్ని మండలాల్లో వర్షం కురిసింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా సరాసరి 6.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పెంబి మండలంలో అధికంగా 14.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, బాసర మండలంలో అత్యల్పంగా 1.4 మిల్లీమీటర్లు నమోదైంది. రానున్న 24 గంటల్లో 15.6 మి.మీల నుంచి 64.5 మి.మీల వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

మండలాలవారీగా నమోదైన వర్షపాతం..

మండలం	వర్షపాతం(మి.మీలలో)	కుభీర్	5.2
పెంబి	14.6	తానూర్	5.2
కడెం పెద్దూర్	11.6	మామడ	5.2
భైంసా	9.4	సారంగపూర్	5.0
కుంటాల	7.6	లక్ష్మణచాంద	4.6
దస్తురాబాద్	7.6	నిర్మల్ రూరల్	4.2
దిలావర్‌పూర్	7.2	నర్సాపూర్(జి)	4.2
ముధోల్	6.6	సోన్	2.8
నిర్మల్	6.2	లోకేశ్వరం	2.2
ఖానాపూర్	6.0	బాసర	1.4



వనభోజనాలకు వృద్ధులు


వనభోజనాల కార్యక్రమంలో వృద్ధులతో నిర్మల హృదయ సేవాసమితి సభ్యులు

నిర్మల్‌ఖిల్లా: వారంతా తమ సొంత కుటుంబాల నుంచి దూరంగా ఉంటున్నారు. అందులో మరికొంత మంది అనాథలు.. పైగా వృద్ధులు.. డవ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వృద్ధాశ్రమంలో జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం ఆషాఢమాసం వనభోజనాలు కొనసాగుతున్న వేళ, నిర్మలహృదయ సేవాసమితి ఆధ్వర్యంలో ఆశ్రమంలో ఉంటున్న వృద్ధులందరికీ వనభోజనాలు ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులో ఆదివారం వీరందరినీ స్థానిక జిల్లా కేంద్రం సమీపంలోని దుర్గామాత ఆలయ పరిసరాలకు తీసుకెళ్లారు. అక్కడి పచ్చని ప్రకృతిఒడిలో వృద్ధులు సరదాగా గడిపారు. ఈ సందర్భంగా వివిధ రకాల వంటకాలతో కూడిన భోజనాలను సమకూర్చడంతో వారి కళ్లు చెమర్చాయి. ఆప్యాయంగా పలుకరిస్తూ ఆత్మీయంగా వడ్డించిన భోజనాలను కడుపునిండా తిని నిర్మల హృదయ సేవా సమితి కార్యవర్గ సభ్యులను మనసారా దీవించారు. సేవా సమితి గౌరవాధ్యక్షుడు నార్లపురం రవీందర్, అధ్యక్షుడు నాయుడు రమేశ్, ప్రధాన కార్యదర్శి శ్రీరాముల శ్రీనివాస్, సభ్యులు యాటకారి సాయన్న, మూర్తి ప్రభు, దుబ్బ లక్ష్మణ్, చంద్రశేఖరవర్మ, తిరుక్కోవల పద్మావతి, అన్నపూర్ణ, సుజాత, ఆశ్రమ నిర్వాహకుడు రాము పాల్గొన్నారు.


వనభోజనాలు చేస్తున్న వృద్ధాశ్రమసభ్యులు

నాగదేవత ఆలయం నిర్మించాలి

మామడ: పొన్కల్ గోదావరినది వద్ద నిర్మించిన సదర్‌మాట్ బ్యారేజీని ప్రారంభించక ముందే ముంపునకు గురవుతున్న నాగదేవతాలయానికి కేటాయించిన స్థలంలో పునర్నిర్మించాలని పీఏసీఎస్ చైర్మన్ చిక్యాల హరీశ్‌కుమార్ కోరారు. గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు ప్రాజెక్టును ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా హరీశ్ కుమార్ మాట్లాడారు. బ్యారేజీని ప్రారంభిస్తే నాగదేవత ఆలయం, హనుమాన్ ఆలయం ముంపునకు గురవుతాయని తెలిపారు. ఆలయాల నిర్మాణం కోసం కేటాయించిన ఆరు ఎకరాల స్థలంలో నూతన ఆలయాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. బ్యారేజీ ప్రారంభిస్తే రైతులు పొలాలకు వెళ్లే రహదారులు మునిగిపోతాయని, రైతుల కోసం రోడ్డు నిర్మించాలని కోరారు. బ్యారేజీ నిర్మాణ పనుల కోసం పట్టా భూములు సేకరించి సాగుకు పనికి రాకుండా చేశారని పేర్కొన్నారు. ఆ భూములను సాగుయోగ్యంగా మార్చి రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాగదేవత ఆలయ నిర్మించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ప్రాజెక్టును సందర్శించిన వారిలో గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ కొరిపెల్లి సుధాకర్‌రెడ్డి, నాయకులు కొండ్ర రాజారెడ్డి, ముత్తన్న, నవీన్, గంగారెడ్డి, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.


పొన్కల్ సదర్‌మాట్ బ్యారేజీ వద్ద గ్రామస్తులు

పాపహరేశ్వరాలయంలో పూజలు

దిలావర్‌పూర్: మండలంలోని ప్రాచీన ప్రాశస్త్యం గల శ్రీమాతాన్నపూర్ణ పాపహరేశ్వరాలయంలో నైమిశారణ్య పీఠాధిపతి బాల బ్రహ్మానంద సరస్వతి ఆదివారం పూజలు చేశారు. ఆలయానికి చేరకున్న ఆయనకు పండితులు, ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం ఆలయ ప్రాంగణంలో భాగవత ప్రవచనాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తర్వాత ఆలయ కమిటీ చైర్మన్ నార్వాడి వెంకట్రావు, ఆలయ ఈవో, ఇన్‌స్పెక్టర్ రవికిషన్‌గౌడ్ బ్రహ్మానంద సరస్వతిని సన్మానించారు.


బ్రహ్మానందసరస్వతిని సన్మానిస్తున్న ఆలయ చైర్మన్

క్లుప్తంగా

జాతీయ సదస్సులకు జిల్లా వాసులు



ఢిల్లీకి వెళ్తున్న కార్మికసంఘం నాయకులు

నిర్మల్‌ఖిల్లా: దేశరాజధాని న్యూఢిల్లీలోని ద్వారక ఐటీసీలో ఈ నెల 15 నుంచి 17 వరకు మూడురోజులు నిర్వహించే సమావేశాలకు జిల్లాకు చెందిన ఇద్దరు కార్మికసంఘం నాయకులు హాజరుకానున్నారు. ''ఆసియా పసిఫిక్ దేశాల నుంచి జరిగే చట్టబద్ధ, సురక్షిత వలసలు వాతావరణ మార్పులు'' అనే అంశంపై నిర్వహిస్తున్న ఇండియన్ కౌన్సిల్ మీటింగ్‌కు ప్రవాసిమిత్ర కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, నిర్మల్ జిల్లాకు చెందిన స్వదేశ్ పరికిపండ్ల హాజరు కానున్నారు. మరోవైపు ఇదే సంఘానికి చెందిన మహిళ నాయకురాలు కొమ్ము గీత జాతీయ మహిళా సదస్సులో ప్రవాసమిత్ర కార్మిక సంఘం తరపున పాల్గొననున్నారు. ఇందులో భవిష్యత్తులో కార్మికుల జీవనోపాధి – మహిళా కార్మికుల వృత్తిపరమైన సమస్యలు, మానసిక ఆరోగ్యం – భద్రత, లింగఆధారిత హింస, భద్రత కమిటీల ఏర్పాటు వంటి అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

దాడి చేసిన నలుగురి రిమాండ్

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బంగారుగూడ కాలనీకి చెందిన మోరే సూర్యకాంత్, ఆయన కుటుంబ సభ్యులను కులం పేరుతో దూషించి కర్రలతో దాడి చేసిన నలుగురిని ఆదివారం రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఈనెల 10న సాయంత్రం సమయంలో సూర్యకాంత్ కాలకృత్యాల కోసం బయటకు వెళ్తున్నారు. అదేకాలనీకి చెందిన అమీర్ ఖాన్, మోసిన్ ఖాన్, సల్మాన్ ఖాన్, షేక్ ఫైజీలు ఆయన్ను కులం పేరుతో దూషించారు. ఆయన కుటుంబ సభ్యులపై కర్రలతో దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. నిందితులకు వైద్యపరీక్షల అనంతరం వారిని కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జి 13 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించారు. జిల్లా జైలుకు తరలించాలని ఉత్తర్వులు జారీ చేశారు.

దాబాల్లో మద్యం పట్టివేత

భైంసాటౌన్: దాబాల్లో మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని పట్టణ సీఐ డి.రాజారెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని పలు దాబాల్లో పోలీసులు ఆదివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. దుర్గా, శ్రీ దాబా, భవానీ, శ్రీ హన్సిక దాబాల్లో 80 లీటర్ల మద్యం పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. వీటి విలువ రూ.40 వేలు ఉంటుందని, ఈ మేరకు మద్యం స్వాధీనం చేసుకుని నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గుల్జార్ మార్కెట్‌లో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికులు అందించిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లారు. వ్యక్తి వయస్సు సుమారు 50 నుంచి 55 ఏళ్లు ఉంటుందని గుర్తించారు. లైట్ పింక్ కలర్‌షర్టు, బ్రౌన్ కలర్ ప్యాంట్, అతని కుడిచేతి మణికట్టు వద్ద ఓమ్ అని పచ్చబొట్టు ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నిర్మల్ ఏరియాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలిస్తే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

కొత్త కొత్తగా..

- జీవితం మలుపు తిరిగేది ఇంటర్‌తోనే..
- ఆకర్షణకు గురైతే భవిష్యత్తు ప్రశ్నార్థకమే
- చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి
- ప్రణాళికతో ముందుకు సాగితే సక్సెస్
- ప్రారంభమైన ఇంటర్ తరగతులు

జిల్లా	పదో తరగతి ఉత్తీర్ణులు
ఆదిలాబాద్	11000
మంచిర్యాల	8552
నిర్మల్	8823
కుమురంభీం ఆసిఫాబాద్	5325
మొత్తం:	33700



ఆదిలాబాద్‌టౌన్: టీనేజ్ అత్యంత కీలక సమయం.. అంతేకాదు.. జీవితాన్ని మలుపులు తిరిగేవి ఇంటర్ దశనే. అన్ని తెలుసనే ఆలోచనతో విద్యార్థులు తప్పటడుగులు వేస్తారు. ఏమాత్రం తొందరపాటు నిర్ణయాన్ని తీసుకున్నా జీవితం మన చేతుల్లోకి రానంత వెనక్కి వెళ్తుంది. పరాజయం బాటలో నిలుస్తుంది. ఇంటర్‌లో చేరే కొత్తవారు ఎలాంటి ఆకర్షణలు, ప్రలోభాలకు గురికాకుండా ముందుకు సాగితే భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుంది. ఇప్పటికే కళాశాలలు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది దాదాపు 33,700 మంది పదో తరగతి ఉత్తీర్ణులయ్యారు. వీరు ఇంటర్ ఫస్టియర్‌లో చేరగా తరగతులు ప్రారంభమయ్యాయి.

ఆకర్షణలకు లోనైతే..

ఇంటర్ విద్యార్థులు ఆకర్షణలకు లోనవుతుంటారు. ఈదశలో అందరికి చదువే తొలి ప్రాధాన్యత కావాలి. తమజీవితం అల్లరి పాలయ్యేలా ఉండకూడదు. సినిమాల్లో చూపించినట్లుగా కాలేజీకి డుమ్మా కొట్టడం, హీరోయిజం కాదనే విషయాన్ని తప్పనిసరిగా తెలుసుకోవాలి. ప్రతిరోజూ పాఠశాలకు వెళ్లిన మాదిరిగానే కళాశాల తరగతులకు హాజరుకావాలి. పాఠ్యాంశాలపై దృష్టిపెట్టాలి. లెక్చరర్లు ఇచ్చే నోట్స్ ఎప్పటికప్పుడు రాసుకోవాలి. పోటీ పరీక్షలకు అనుగుణంగా ప్రణాళిక రూపొందించుకోవాలి.

చదువుపై శ్రద్ధ పెట్టాలి



ఇంటర్‌లో చేరిన విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. తెలిసీ తెలియని వయస్సులో పెళ్లి చేసుకుంటే జీవితం నాశనం అవుతుంది. అనాలోచిత నిర్ణయాలతో భవిష్యత్తు అంధకారంలో వెళ్తోంది. ఈ దశనే విద్యార్థికి మలుపు.

– డాక్టర్ క్రాంతికుమార్

లక్ష్యసాధన కోసం ముందుకు



విద్యార్థులు కష్టపడి చదివి లక్ష్యాలను నెరవేర్చుకోవాలి. తల్లిదండ్రుల ఆశయసాధన కోసం ముందుకు సాగాలి. ప్రేమ, సినిమా, షికార్లకు ఆకర్షితులు కావొద్దు.

– భగవాండ్లు, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్

చెడు వ్యసనాలకు గురికావొద్దు

ఇంటర్‌లో చేరే విద్యార్థులకు చెడు వ్యసనాలకు గురి కావొద్దు. విద్యార్థులను ప్రభావితం చేసేది స్నేహం. చదువుపై ఇష్టం, ప్రజలపై గౌరవం, సమాజంపై అవగాహన, లెక్చరర్లపై సదాభిప్రాయం ఉన్నవారితో స్నేహం చేయాలి. అలాంటి దృక్పథంతోనే ముందుకు సాగాలి. లేదంటే చెడు వ్యసనాలకు అలవాటుపడి జీవితాలు నాశనమయ్యే ప్రమాదం ఉంది. సిగరేట్లు, గుట్కాలు, మద్యం, ఇతర మత్తు పదార్థాలకు అలవాటుపడితే జీవితం ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం లేకపోలేదు. పరిచయం ఉన్నవారు, అపరిచిత వ్యక్తులతో సోషల్ మీడియా ద్వారా చాటింగ్ చేయొద్దు. అశ్లీలత వైపు మనస్సు మళ్లితే అంతే సంగతి. పార్టీలు, వేడుకల పేరుతో స్నేహితులు చెడుదారుల వైపు తీసుకెళ్లే అవకాశాలు ఉంటాయి. వీటితో జాగ్రత్తగా ఉండాలి.

అంతా తెలుసనే ధోరణితో..



ఇంటర్ విద్యార్థులు అంతా తెలుసనే ధోరణిలో వ్యవహరిస్తారు. ఒక్కసారి పంజరం నుంచి విడుదలైన పక్షుల్లా అనుభూతి పొందుతారు. అప్పుడే వారి ఆలోచనల్లో మార్పులు వస్తాయి. చెడు వ్యసనాలకు అలవాటుపడడం, కళాశాలకు డుమ్మా కొట్టడం చేస్తుంటారు. తల్లిదండ్రులు, పోషకులు పిల్లల తీరును పర్యవేక్షించాలి.

– డాక్టర్ ఓంప్రకాశ్, సైకియాట్రిస్ట్

తల్లిదండ్రులు గమనించాలి



ఇంటర్, డిగ్రీ దశల్లోనే విద్యార్థులు డ్రగ్స్, మత్తు పదార్థాలు అలవాటుపడతారు. సరదాగా మొదలై బానిసలుగా మారుతారు. వీటిని నియంత్రించేందుకు యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేశాం. విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి. తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తూ ఉండాలి. ఆడపిల్లల్ని ఇబ్బందులకు గురిచేస్తే డయల్ 100కు సమాచారం అందించాలి. డ్రగ్స్‌కు ప్రోత్సహించినా, విక్రయించినా చర్యలు తీసుకుంటాం.

– ఎల్.జీవన్‌రెడ్డి, ఆదిలాబాద్ డీఎస్పీ

ఆర్టీసీ బస్సు ఢీకొని రెండు గేదెలు మృతి

- మరో రెండింటికి గాయాలు



మృతిచెందిన గేదెలు

సారంగాపూర్: ఆర్టీసీ బస్సు ఢీకొని రెండు గేదెలు మృతిచెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. భైంసా డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆదిలాబాద్ వైపు నుంచి నిర్మల్ వస్తోంది. మేతకు వెళ్లిన గేదెల మంద రోడ్డుకు పక్క నుంచే గ్రామంలోకి వెళ్తున్నాయి. మండలంలోని చించోలి(బి) సమీపంలోని మహబూబాఘాట్స్ వద్ద వేగంగా వచ్చిన బస్సు ఢీకొంది. నిర్మల్ రూరల్ మండలం రాణాపూర్‌కు పశువైద్యుడు విజయ్, ఇదే గ్రామానికి చెందిన రైతు జాదవ్ ఇంధల్‌కు చెందిన రెండు గేదెలు అక్కడికక్కడే మృతిచెందగా మరో రెండింటికి తీవ్రగాయాలయ్యాయి. మరికొన్నింటికి స్వల్పగాయాలయ్యాయని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. బస్సు డ్రైవర్ పరారీ ఉన్నారని పేర్కొన్నారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



హన్మంతు

నెన్నెల: మండలంలోని నందులపల్లికి చెందిన సోమిశెట్టి హన్మంతు అదృశ్యమైనట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..హన్మంతు ఈనెల 13న మధ్యాహ్నం 12 గంటలకు మందు స్ప్రే చేసే డబ్బా కొనుగోలు చేసుకొని వస్తానని ఇంట్లో నుంచి రూ.30 వేలు తీసుకొని వెళ్లాడు. ఇప్పటివరకు తిరిగి రాలేదు. భార్య రజిత, కుటుంబ సభ్యులు బంధువుల, చుట్టుపక్క ఇళ్లల్లో వెతికినా ఆ చూకీ దొరకలేదు. భార్య రజిత ఫిర్యాదుతో ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైలు ఢీకొని వలసకూలీ మృతి

మంచిర్యాలక్రైం: ప్రమాదవశాత్తు రైలు ఢీకొని వలసకూలీ మృతి చెందిన ఘటన జిల్లాకేంద్రంలో చోటుచేసుకుంది. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సురేశ్‌గౌడ్ కథనం ప్రకారం.. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానెపల్లి మండలం రుద్రపూర్‌కు చెందిన లెండుగురి హన్మంతు కుమారుడు చిన్న (19) గత కొంతకాలంగా కుటుంబ సభ్యులతో కలిసి మంచిర్యాలకు వలసవచ్చాడు. రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటూ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆదివారం ఉదయం రాజీవ్‌నగర్ అండర్ బ్రిడ్జి వద్ద రైలు పట్టాలు దాటుతుండగా వేగంగా వచ్చిన దురంతో ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి వద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య



పెద్ద రాజన్న (ఫైల్)

తాంసి: కడుపునొప్పి భరించలేక వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తాంసి ఎస్సై శివరాం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆదిలాబాద్ రూరల్ మండలం బట్టిసావర్గాం గ్రామానికి చెందిన జక్కుల పెద్దరాజన్న (50) గత కొంత కాలంగా కడుపునొప్పి, షుగర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఆస్పత్రిలో చూపిస్తే నయం కాలేదు. దీంతో తీవ్ర మనస్తాపం చెంది ఆదివారం తాంసి మండలం పొన్నారి గ్రామ శివారు పంట చేనులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించారు. భార్య రుక్మాబాయి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ప్రేమ విఫలంతో యువకుడు..

దస్తురాబాద్: ప్రేమ విఫలం కావడంతో యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాలపడ్డాడు. మండలంలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఇన్‌చార్జి ఎస్సై శంకర్ కథనం ప్రకారం.. గోడిసీర్యాల గ్రామానికి చెందిన పానుగంటి పవన్(21) అదే గ్రామానికి చెందిన ఓ యువతి ప్రేమించుకున్నారు. ఈ విషయం తెలియడంతో ఇరువురు పెద్దలకు తెలిసింది. యువతి తల్లిదండ్రులు ఆమెకు గత ఆరు నెలల క్రితం వేరే వ్యక్తితో వివాహం జరిపించారు. దీంతో తీవ్ర మనస్తాపం చెందాడు. ఈనెల 11న గోడిసీర్యాల ఎక్స్‌రోడ్డు నుంచి మిత్రులకు వీడియో కాల్ చేసి పురుగుల మందు తాగాడు. వెంటనే మిత్రులు కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని పవన్‌ని నిర్మల్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు పంపించారు. శనివారం అర్ధరాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై తెలిపారు.



బ్రిడ్జిలా సాగునీటి కెనాల్

వంతెన కాదు..కెనాలే

ఈ చిత్రాన్ని చూస్తే ఇదేదో రైలు, బస్సులు వెళ్లేందుకు నిర్మించిన వంతెన అనుకుంటే పొరపాటే. ఇది జైనథ్, బేల మండలాల్లోని పంట చేలకు లోయర్ పెన్‌గంగా నది నుంచి సాగునీరందించేందుకు ప్రీకాస్ట్ పద్ధతిన వయాడక్ట్‌లతో నిర్మించిన కెనాల్ ఇది. ఆదిలాబాద్ రూరల్ మండలం చాందటి సమీపంలోని వాగుపై 68 పిల్లర్లపై 24.4 మీటర్ల పొడవు, 5.2 మీటర్ల వెడల్పుతో 67 షెల్ఫ్‌లతో అధునాతన సాంకేతికతతో నిర్మించిన వంతెన ఆకట్టుకుంటుండంతో ఔరా అనిపిస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



సాగునీటిని పంపించేలా షెల్ఫ్‌లతో నిర్మించిన కెనాల్



కెనాల్‌తో అనుసంధానించిన వయడాక్ట్ బ్రిడ్జి

నాగోబాకు పూజలు



అదనపు ఎస్పీ, ఎస్డీ డీఎస్పీకి నాగోబా చిత్రపటం అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఇంద్రవెల్లి: మండలంలోని కేస్లాపూర్ గ్రామంలో నాగోబా ఆలయంలో అదనపు ఎస్పీ సురేందర్ రావు, ఎస్బీ డీఎస్పీ పోచారం శ్రీనివాస్‌రావు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వారికి శాలువా కప్పి సత్కరించారు. నాగోబా చిత్రపటాన్ని అందజేశారు. తర్వాత అదనపు ఎస్పీ, ఎస్బీ డీఎస్పీలు ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఫలితాలు సాధించాలన్నారు. డీఎస్పీ నాగేందర్, సీఐ మొగిలి, ఎస్సై సునీల్, నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకటరావు, మాజీ సర్పంచ్ రేణుక నాగనాథ్, పూజారి మెస్రం షేకు ఉన్నారు.

వేజ్ ప్రొటక్షన్ కల్పించాలి

- సర్ఫేస్ జనరల్ మజ్దూర్ నిబంధనలపై సీనియర్ కార్మికుల పెదవి విరుపు
- ఈ నెల 18 వరకు దరఖాస్తుల స్వీకరణ
- అన్ని కేటగిరీలకు వర్తించినా ప్రయోజనం శూన్యం



గనిలో పని చేస్తున్న సపోర్టుమెన్లు (ఫైల్)

శ్రీరాంపూర్: సింగరేణిలో సర్ఫేస్ జనరల్ మజ్దూర్ల భర్తీలో వేజ్ ప్రొటక్షన్ కల్పించాలని సీనియర్ కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఇన్నాళ్లు ఖాళీల కోసం వేచి అండర్‌గ్రౌండ్‌లోని అన్ని కేటగిరీ కార్మికులకు నేడు కంపెనీ ఇచ్చిన దీని నోటిఫికేషన్ ఏమాత్రం రుచించడం లేదు. ఆశపడి భంగపడ్డామని కార్మికులు వాపోతున్నారు. అన్ని ఏరియాల్లో సర్ఫేస్ జనరల్ మజ్దూర్ల భర్తీకి కంపెనీ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. పెద్ద ఏరియా అయిన శ్రీరాంపూర్‌లో మొత్తం 108 ఖాళీలు సూచించింది. వీటికి ఈనెల 18 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

అన్ని కేటగిరీలకు అవకాశం..

మొదటిసారిగా అండర్ గ్రౌండ్‌లో పనిచేసే అన్ని రకాల కేటగిరీల వారికి సర్ఫేస్ జనరల్ మజ్దూర్‌కు అవకాశం కల్పించారు. ఇంతకు ముందు కేవలం అండర్ జనరల్ మజ్దూర్ వారికే అవకాశం ఉండేది. మిగతా కేటగిరీలకు వారికి లేదు. దీనిపై ఇటీవల గుర్తింపు సంఘంగా గెలిచిన ఏఐటీయూసీ నాయకులు యాజమాన్యంతో మాట్లాడి అన్ని కేటగిరీల వారికి అవకాశం కల్పించాలని కోరారు. కంపెనీ మైనింగ్‌స్టాఫ్, ట్రేడ్స్‌మెన్‌లను మినహాయించి మిగిలిన అన్ని కేటగిరీల వారికి అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. చాలామంది యువ కార్మికులు ట్రామర్, ఎస్‌డీఎల్ ఆపరేటర్, కోల్‌కట్టర్, సపోర్టుమెన్ల యాక్టింగ్‌లు చేస్తున్నారు కాని ఆయా కేటగిరీల్లో చేరడానికి లెటర్లు తీసుకోవడానికి అయిష్టత చూపుతూ జనరల్ మజ్దూర్లుగా ఉంటున్నారు. దీంతో చాలా ఖాళీలు మిగులుతున్నాయి. కారణం సర్ఫేస్‌లో జనరల్ మజ్దూర్లు పడితే ఆయా కేటగిరీ వారికి అవకాశం లేకపోవడమే. ఈక్రమంలో కంపెనీ అన్ని కేటగిరీల వారికి అవకాశం కల్పిస్తే వారు చేరుతారని ఆశించి ఉత్తర్వులు ఇచ్చింది.

ఆర్థికంగా నష్టమే..

అండర్‌గ్రౌండ్ నుంచి సర్ఫేస్ జనరల్ మజ్దూర్‌కు వస్తే సీనియర్ కార్మికులకు, ఇతర కేటగిరీల వారికి ఆర్థికంగా నష్టం వస్తుంది. నెల వేతనంతోపాటు భవిష్యత్తులో పెన్షన్, గ్రాట్యుటీలో భారీ నష్టం వస్తుందని కార్మికులు పేర్కొంటున్నారు. సర్ఫేస్ జనరల్ మజ్దూర్‌కు కంపెనీ అందరికి అవకాశం కల్పించిన దాన్ని సద్వినియోగం చేసుకోకుండా కంపెనీ నిబంధనలు ప్రతిబంధకంగా మారాయి. 1వ కేటగిరీ కావడం, అండర్‌గ్రౌండ్ నుంచి ఎవరు వచ్చి చేరిన వారి పాత వేతనం రాదు. బేసిక్ ప్రొటక్షన్ కల్పించకపోవడంతో సర్ఫేస్ జనరల్ మజ్దూర్‌కు వస్తే ఆర్థికంగా తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని వారు వాపోతున్నారు. అండర్‌గ్రౌండ్ జనరల్ మజ్దూర్లకు మాత్రమే ప్రయోజకారిగా ఉత్తర్వులు ఉన్నాయి. అండర్ గ్రౌండ్‌లో 5వ కేటగిరీలో పని చేస్తున్న కార్మికుడు మజ్దూర్‌గా చేరితే అతనికి మొదటి కేటగిరీ వేతనమే ఇస్తారు. అప్పటి వరకు ఇంక్రిమెంట్లు ఉంటే వాటిని మొదటి కేటగిరీ వేతనంను కలిపి బేసిక్‌ఫిక్స్ చేస్తారు. రూ.వేలల్లో వేతనం తగ్గిపోతుంది. అతనికి ప్రమోషన్ వచ్చుడేమో కాని వేతనం ప్రకారం చూస్తే డీ ప్రమోట్ అయినట్లేనని కార్మిక సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. కంపెనీ వేజ్‌ప్రొటక్షన్ కల్పించి వీటిని భర్తీ చేయాలని సీనియర్ కార్మికులు పేర్కొంటున్నారు.

అటవీ అధికారులపై కేసు నమోదు చేయాలి



పత్తి చేన్లను పరిశీలిస్తున్న ఎర్మ పున్నం

కోటపల్లి: పత్తి చేనులో గడ్డి మందు కొట్టి మొక్కలు చంపిన అటవీ అధికారులపై కేసు నమోదు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్మ పున్నం డిమాండ్ చేశారు. మండలంలోని బొప్పారం గ్రామంలో పోడు సాగుదారులు రాజేశ్, ప్రశాంత్, సురేశ్, శంకర్‌కు చెందిన పత్తి చేన్లలో గడ్డిమందు కొట్టగా ఆదివారం ఆయన పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ఇప్పటికే చాలాసార్లు సాగుదారుల జోలికి వెళ్లొద్దని చెప్పినా అటవీ అధికారులు దాడులు చేస్తున్నారని తెలిపారు. గిరిజనులకు చెందిన రాజేశ్‌కు హక్కుపత్రం ఉన్నా కంచెను తొలగించి పత్తి చేనుకు గడ్డిమందు కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.

అ'పూర్వ' కలయిక



కుంటాల: కుంటాల ఉన్నత పాఠశాల 1989-90 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు 35 ఏళ్ల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. వీరి అపూర్వ కలయికకు పాఠశాల వేదికైంది. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి మధుర స్మృతులను గుర్తుచేసుకున్నారు. గురువులను సన్మానించారు. పూర్వవిద్యార్థి, ఉపాధ్యాయుడు బి.లక్ష్మణ్ రావు తనతండ్రి లింగారావు జ్ఞాపకార్థంగా పాఠశాల అభివృద్ధికి రూ.10 వేల నగదును ఎంఈవో ముత్యంకు అందజేశారు.



ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్ఎస్ 1994-95 బ్యాచ్ పదో తరగతి తొలిబ్యాచ్ ఆదివారం కలుసుకున్నారు. 30 ఏళ్ల తర్వాత అందరూ హాజరైన అపూర్వ సమ్మేళనానికి పాఠశాల వేదికైంది. చిన్ననాటి గుర్తులను నెమెరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు కె.నారాయణరావు, కలిపె రాజ్‌కుమార్, రజాక్‌బేగ్, క్రిష్ణమూర్తి, నర్సయ్య, పెద్దన్న, గంగన్న, వెంకటేశ్వర్లను సన్మానించారు.

క్లుప్తంగా

వర్షాలు కురువాలని పూజలు



ఆలయానికి వెళ్తున్న గ్రామస్తులు

భైంసారూరల్: వర్షాలు కురవాలని మండలంలోని హజ్గుల్ గ్రామంలో ఆదివారం గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరి జలాలను తీసుకొచ్చి భాజాభజంత్రీల నడుమ ఊరేగింపుగా వెళ్లి గ్రామదేవతలకు అభిషేకం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో మొక్కల పంపిణీ

భైంసాటౌన్: పట్టణంలోని 3, 5, 18 వార్డుల్లో మున్సిపల్ సిబ్బంది ఆదివారం మొక్కలు పంపిణీ చేశారు. వన మహోత్సవంలో భాగంగా కాలనీల్లో ఇంటింటికీ మొక్కలు అందజేశారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో మెప్మా టీఎంసీ దత్తాత్రి, సీవోలు వెంకటేశ్, ముజమ్మిల్, ఆర్పీలు ఉన్నారు.

గ్రామాల్లో పీరీల ఊరేగింపు



కొండుకూర్‌లో ఊరేగిస్తున్న గ్రామస్తులు

కడెం: మండలంలోని కొండుకూర్, ధర్మాజీపేట్ గ్రామాల్లో మొహర్రం ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పీరీల ఊరేగింపు నిర్వహించారు. పీరీల సవారీలు ఇంటింటికీ వెళ్లగా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు కుడకలు, నూతన వస్త్రాలను విరాళంగా అందించారు.

ఉపాధ్యాయులకు సన్మానం



సన్మాన గ్రహీతలతో బృందం సభ్యులు

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలోని 'స్నేహమిత్ర' బృందం సభ్యుల్లో కొందరు ఉపాధ్యాయులు ఇటీవల స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందారు. కాగా ఆదివారం జిల్లా కేంద్రంలో పదోన్నతి పొందిన తోట నరేంద్రబాబు, మురళి, నరేందర్, అశోక్‌రెడ్డి, ప్రవీణ్‌ను మిత్రబృందం సభ్యులు ఘనంగా సన్మానించారు. అంకితభావంతో విధులు నిర్వరిస్తూ విద్యార్థుల అభివృద్ధికి పాటుపడుతున్నారని వారిని కొనియాడారు. కార్యక్రమంలో స్నేహమిత్ర బృందం సభ్యులు పీజీ రెడ్డి, కేపీరెడ్డి, రవికిరణ్, సాయిరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా..ఉత్సాహంగా



బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

కడెం: కడెం ప్రాజెక్ట్ జలకళను సంతరించుకోవడంతో పర్యాటకుల తాకిడి పెరిగింది. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన పర్యాటకులు ప్రాజెక్ట్ అందాలను తిలకించారు. అనంతరం బోటింగ్ చేసి ఉల్లాసంగా గడిపారు.

ఆయిల్‌పాం సాగుతో ఆదాయం



మొక్క నాటుతున్న రైతులు

కుంటాల: ఆయిల్‌పాం సాగుతో రైతులకు ఆదాయం సమకూరుతుందని మండల క్లస్టర్ ఇన్‌చార్జి ఆముదారి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని ఓలా గ్రామంలో సదాశివ్‌పటేల్ అనే రైతు నాలుగెకరాల్లో 200 మొక్కలు నాటారు. తక్కువ పెట్టుబడితో 30 ఏళ్ల వరకు దిగుబడి వస్తుందని.. రైతులు ఆర్థికంగా ఎదగవచ్చని ఆయన తెలిపారు.

కార్యక్రమం రద్దు

సారంగపూర్: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన శ్రీ అడెల్లి మహాపోచమ్మ ఆలయం వద్ద ఆదివారం జరిగే దేవీ భాగవతం ప్రవచనాల కార్యక్రమం అనివార్య కారణాలతో రద్దు చేసినట్లు ఇన్‌చార్జి ఈఓ రవికిషన్‌గౌడ్ తెలిపారు. మళ్లీ ప్రవచనాల కార్యక్రమం నిర్వహించే తేదీని భక్తులకు తెలియజేస్తామని పేర్కొన్నారు.

లోలెవల్ వంతెనలతో తిప్పలు

తానూరు: వర్షాకాలంలో లోలెవల్ వంతెనలపై నుంచి వరదలు ప్రవహిస్తుండటంతో నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఏటా ఈ సమస్య తలెత్తి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. దీంతో అత్యవసరంగా ఆసుపత్రికి వెళ్లాలన్నా.. ఊరు దాటడం సాధ్యం కావడం లేదని లోలెవల్ వంతెన ఉన్న సరిహద్దు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. హైలెవల్ వంతెన(బ్రిడ్జి)లు నిర్మించాలని అధికారులు, పాలకులకు ఏళ్లుగా విన్నవిస్తున్నా.. పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- గ్రామాల్లో చిన్నపాటి వర్షాలకే మునుగుతున్న వైనం
- ఏళ్లుగా రాకపోకలకు ఇబ్బందులు
- హైలెవల్ వంతెనలు నిర్మించాలని ప్రజల వేడుకోలు
- పట్టించుకోని అధికారులు



తానూరు మండలం ఝరి(బి) లోలెవల్ వంతెనపై నుంచి పారుతున్న వరద (ఫైల్)



భైంసా మండలంలోని గుండెగాం లోలెవల్ వంతెనపై నుంచి ప్రవహిస్తున్న వరద (ఫైల్)



వడ్ఝరి(బి) సమీపంలో లోలెవల్ వంతెన

సరిహద్దు గ్రామాల్లో..

నియోజకవర్గంలోని తానూరు, కుభీర్, భైంసా, ముధోల్ మండలాలు మహారాష్ట్రకు సరిహద్దు ప్రాంతంలో ఉన్నాయి. తానూరు మండలంలో ఝరి(బి), వడ్ఝరి(బి), మొగ్లి, వాడవన, మహలింగి గ్రామాల్లో.. కుభీర్ మండలంలోని బెల్గాం, , ధార్ కుభీర్, డోడర్నా, భైంసా మండలంలోని గుండెగాం, మహాగాం, ముధోల్ మండలంలోని మచ్కల్, ముద్గల్, బోరిగాం గ్రామాల్లో ఏళ్ల కిందట నిర్మించిన లోలెవల్ వంతెనలు ఉన్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా లోలెవల్ వంతెనలపై నుంచి వరద పోటెత్తుంది. దీంతో ఆయా గ్రామాలకు రాకపోకలు స్తంభిస్తున్నాయి. గతేడాది కురిసిన భారీ వర్షాలకు ఝరి(బి), తొండాల, దౌలతాబాద్, వాడవన, మొగ్లి గ్రామాలకు వెళ్లే మార్గంలో ఉన్న లోలెవల్ వంతెనలపై నుంచి వరద ప్రవహించడంతో ప్రజలు అవస్థలు పడ్డారు.

ఏళ్లుగా విన్నవిస్తూ..

లోలెవల్ వంతెనలున్న చోట హైలెవల్ వంతెనలు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు ఏళ్లుగా అధికారులు, పాలకులకు వినతిపత్రాలు సమర్పిస్తూనే ఉన్నారు. గతేడాది ఝరి(బి) గ్రామస్తులు మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని కలిసి హైలెవల్ వంతెన నిర్మించాలని కోరారు. సమస్య పరిష్కరిస్తామని ఇచ్చిన హామీ ఇప్పటికీ నెరవేరలేదని గ్రామస్తులు తెలిపారు. వారం రోజుల కిందట భైంసాలో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్‌ను కలిసి ఝరి(బి) గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఏటా వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నామని సమస్య పరిష్కరించాలని వేడుకున్నారు. స్పందించిన ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే రామారావ్ పటేల్ గ్రామానికి బ్రిడ్జి నిర్మిస్తామని చెప్పినట్లు గ్రామస్తులు వివరించారు.



ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే రామారావ్ పటేల్‌కు వినతిపత్రం అందిస్తున్న ఝరి(బి) గ్రామస్తులు

కష్టాలు పడుతున్నాం.



ఝరి(బి) గ్రామ సమీపంలో హైలెవల్ వంతెన నిర్మించాలని ఏళ్లుగా అధికారులు, పాలకులను వేడుకుంటున్నాం. ఏటా వర్షాకాలంలో వరదలు వస్తే గ్రామం నుంచి బయటకు వెళ్లలేకపోతున్నాం. వరద ప్రవహిస్తుండటంతో కష్టాలు అనుభవిస్తున్నాం. ఈసారైనా తమ సమస్య పరిష్కరించాలి.

– శివదాస్, ఝరి(బి), మం.తానూరు

ఏటా ఇబ్బందులే..



ఏటా వర్షాకాలంలో లోలెవల్ వంతెనపై నుంచి నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. వరద వస్తే ఝరి(బి), ఝరి(బి)తండా, మహారాష్ట్రంలోని బోధి, రాతీ గ్రామాలకు రవాణా నిలిచిపోతోంది. అత్యవసరంగా ఆసుపత్రికి వెళ్లాలన్నా ఏం చేయాలని పరిస్థితి నెలకొంది. తమ గ్రామానికి బ్రిడ్జి నిర్మించాలని 50 ఏళ్లుగా పాలకులు, అధికారులకు విన్నవిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

– జిల్లావార్ భోజన్న, ఝరి(బి), మం.తానూరు

ప్రతిపాదనలు పంపించాం

ముధోల్, తానూరు మండలాల్లో లోలెవల్ వంతెనలు ఉన్న చోట బ్రిడ్జిల మంజూరు కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరవగానే పనులు ప్రారంభిస్తాం. తానూరు మండలంలోని మొగ్లి, ఝరి(బి), మహలింగి, వాడవన గ్రామాలతోపాటు ముధోల్ మండలం మచ్కల్, ముద్గల్ గ్రామాల్లోని ప్రజల సమస్యలు పరిష్కరిస్తాం.

– జాదవ్ చందు, పీఆర్ డీఈ

డిజిటల్ లావాదేవీలపై శిక్షణ



అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ సిబ్బంది

సోన్: మండలంలోని పాక్‌పట్ల గ్రామంలో ఎస్‌బీఐ కౌన్సిలర్ పవన్ ఆధ్వర్యంలో ఆదివారం మహిళా సంఘాల సభ్యులకు ఆర్థిక అక్షరాస్యతలో భాగంగా డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గూగుల్‌పే, ఫోన్‌పే ద్వారా చెల్లింపులు చేసే విధానం వివరించారు. సుకన సమృద్ధి యోజన, ప్రధానమంత్రి జీవన జ్యోతి తదితర బీమా పథకాలపై శిక్షణ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డ్రీమ్ సొసైటీ కోఆర్డినేటర్ చిన్నయ్య, ఐకేసీ సీసీ శ్రీనివాస్, వీఓఏ గంగాధర్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నేడు పంటల వివరాలు నమోదు

ముధోల్: మండల కేంద్రంలోని మహాలక్ష్మీ గల్లి శివాలయం వద్ద సోమవారం పంటల వివరాలు నమోదు చేయనున్నట్లు ఏఈవో సీరాదుద్దిన్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ఆన్‌లైన్‌లో పంటల వివరాలను నమోదు చేస్తామని.. రైతులు పట్టాదారు పాసుపుస్తకాలు తెచ్చుకోవాలని సూచించారు. వివరాలు నమోదు చేసుకుంటేనే పంట దిగుబడులు విక్రయించే సమయంలో ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు.

అందుబాటులో ఎరువులు

లోకేశ్వరం: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో ఎరువులు అందుబాటులో ఉన్నాయని చైర్మన్ రత్నాకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి ఎరువులను విక్రయిస్తామని.. యూరియా బస్తా రూ.270, డీఏపీ బస్తా రూ.1340గా ఉందన్నారు. అవసరమైన రైతులు ఆధార్, బ్యాంకుఖాతా, పట్టాదారు పాసుపుస్తకాలను వెంట తెచ్చుకోవాలని సూచించారు.

గ్రామాల్లో బోనాల వేడుకలు



పొట్టపెల్లిలో గోదావరి జలాలతో వెళ్తున్న గ్రామస్తులు



సోన్: సాకెరలో ఆలయం వద్ద మహిళలు

లక్ష్మణచాంద: ఆషాఢమాసం నేపథ్యంలో మండలంలోని చింతల్‌చాంద, పొట్టపెల్లి, పీచర గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగ నిర్వహించారు. వీడీసీ ఆధ్వర్యంలో గోదావరి జలాలను తీసుకొని గ్రామదేవతల ప్రతిమలకు అభిషేకం చేశారు. గ్రామ దేవతలకు బోనాలను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

సోన్: మండలంలోని సాకెర గ్రామంలో ఆదివారం ఆర్యవైశ్యులు బోనాల పండుగ నిర్వహించారు. స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం నుంచి బంగల్‌పేట మహాలక్ష్మీ ఆలయం వరకు మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లారు. అమ్మవారికి నైవేద్యంగా బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వాసవిమాత ఆలయంలో గోరింటాకు వేడుకలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కిషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముత్యం, సంతోష్‌గుప్తా, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



ఖానాపూర్‌లో మాట్లాడుతున్న భీంసేన్

ఖానాపూర్: పట్టణంలోని సుభాశ్‌నగర్ కాలనీలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, షబ్బీర్‌పాషా, హెచ్‌ఎం ముక్క రాజేశ్వర్, వైద్యులు అల్లాడి సురేశ్, ఉమేశ్ గుప్తా, సేవా సమితి జిల్లా కన్వీనర్ భీంసేన్, మండల కన్వీనర్ రత్నాకర్‌రావు, సభ్యులు రాజేశ్వర్, గంగాధర్, సదయ్య, పీరాజీ తదితరులున్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు నరేశ్

తానూరు: మండలంలోని కోలూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆదివారం భైంసాలోని ఆరుష్ ఆస్పత్రి ఆధ్వర్యంలో చిన్నారులకు వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ నరేశ్ బిందేలా మాట్లాడుతూ 60 మంది చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, సురేశ్‌పటేల్, పంచాయతీ కార్యదర్శులు మహేశ్, భూమారెడ్డి, షేక్ పాషా, జ్ఞానేశ్వర్, పోతన్న, సిబ్బంది ఉన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

ఖానాపూర్: మండలంలోని సింగాపూర్‌లో ఉన్న పెద్దమ్మతల్లి ఆలయానికి ఆదివారం భక్తుల తాకిడి పెరిగింది. ఏటా వానాకాలంలో ఆది, గురువారాల్లో పలు మండలాల భక్తులు కుటుంబసభ్యులతో వచ్చి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటారు. చుట్టూ అటవీ ప్రాంతం ఉండటంతో సహపంక్తి భోజనాలు చేసి సందడిగా గడుపుతారు.

'అడెల్లి' మహాపోచమ్మకు అభిషేకం

సారంగపూర్: మండలంలోని అడెల్లి మహాపోచమ్మ అమ్మవారికి ఆదివారం అడెల్లి గ్రామస్తులు గుండం నీటితో అభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన భక్తులు తెల్లవారుజామున గుండం నీటిని తెచ్చి ప్రత్యేక పూజలు చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసశర్మ తెలిపారు.

ఇంటి వద్ద ప్రసవం.. ఆసుపత్రికి తరలింపు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మివాడ డబుల్ బెడ్‌రూం కాలనీలో నివాసం ఉండే లక్ష్మి అనే గర్భిణి ఆదివారం తన ఇంట్లో పురిటినొప్పులతో బాధపడుతుండగా స్థానికులు 108 సిబ్బందికి సమాచారం అందించారు. 108 సిబ్బంది వచ్చేలోపే ఆమె శిశువుకు జన్మనిచ్చింది. గర్భిణికి తోడుగా తన ఇద్దరు ఆడపిల్లలు తప్ప ఎవరూ లేరు. అనంతరం 108 సిబ్బంది బాలింతను, శిశువును జిల్లా కేంద్రంలోని ప్రసూతి ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు తల్లి,బిడ్డ క్షేమంగా ఉన్నారని తెలిపారు.



బాలింతను ఆసుపత్రికి తీసుకెళ్తున్న సిబ్బంది

విద్యార్థినులకు సన్మానం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకేంద్రంలోని శ్రీ సోమవంశీయ సహస్రార్జున క్షత్రియ (ఖత్రి) సమాజ్‌లో ఆదివారం బారడ్ పోతన్న జ్ఞాపకార్థం ఆయన కుమారుడు బారడ్ కిరణ్ ఇటీవల పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులు హజారే తేజస్వీ, హజారే వర్షితను శాలువా, మెమెంటో, పారితోషికంతో సన్మానించారు. కార్యక్రమంలో సమాజ్ అధ్యక్షులు పితాంబర్ చావ్లా, కిశోర్, నాగేశ్వర్, రమేశ్, సుధాకర్, నాగేశ్వర్ దొండి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌కు..

ఖానాపూర్: ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన ఎన్.ప్రీతంను ఆదివారం కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్‌నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు.

గజ్జలమ్మదేవికి పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీగజ్జలమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వర్షాలు కురిసి పంటలు పండాలని కోరుతూ గజ్జల మ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మీ అమ్మవారి ఆలయాల్లో మహారాష్ట్రలోని ముంబై, నాందేడ్, భోకర్, ధర్మబాద్, ఇస్లాపూర్, శివిని, తదితర ప్రాంతాల భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గురుస్వామి జక్కని గజేందర్ ఆధ్వర్యంలో గజ్జలమ్మకు అభిషేకం, అలంకరణ, అర్చన, హారతి, పల్లకీసేవ నిర్వహించారు.

ఘనంగా సల్లముంతల పండుగ

ఖానాపూర్: పట్టణంలోని గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సల్లముంతల పండుగ నిర్వహించారు. శ్రీరాంనగర్‌లోని పోచమ్మ ఆలయానికి భక్తులు సల్లముంతలతో ఊరేగింపుగా వెళ్లారు. ఈసందర్భంగా డప్పుచప్పుళ్ల నడుమ గొల్లెనతో ర్యాలీ తీశారు. ఆలయం చుట్టూ జలాలతో అభిషేకం చేశారు. వర్షాలు కురిసి పంటలు పండాలని.. ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కుకున్నారు.



సల్లముంతలతో వస్తున్న మహిళలు



శివాజీచౌక్‌లో నడి రోడ్డుపై..

పశువులతో పరేషాన్



జిల్లా కేంద్రంలో ప్రధాన రహదారులపై మూగజీవాలు గుంపులు గుంపులుగా తిరుగుతుండటంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం బిజీగా ఉండే శివాజీచౌక్, ఏఎన్‌రెడ్డి కమాన్, బైల్‌బజార్, శాంతినగర్ చౌరస్తా, ఆర్డీవో కార్యాలయం గుండా వెళ్లే రోడ్లపై పశువులు ప్రమాదకరంగా సంచరిస్తున్నాయి. దీంతో పశువులు అడ్డుగా రావడంతో వాహనదారులు కిందపడుతున్నారు. అధికారులు స్పందించి మూగజీవాలు రోడ్లపై రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



జిల్లా కేంద్రంలోని ఏఎన్‌రెడ్డి కమాన్ వద్ద..



బైల్‌బజార్ చౌరస్తాలో గుంపులుగా పశువులు